క్లుప్తంగా

ఈవీఎంలపై అవగాహన



పాలెంచెరువు గూడెంలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల, పాలెంచెరువు గూడెం, బండినాయిని పాలెం, వీరాపురం, కొత్తపల్లి గ్రామాల్లో రెవెన్యూ అధికారులు శుక్రవారం ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈవీఎం ఎలా పనిచేస్తుంది, ఓటరు ఎలా ఓటు వేయాలి, ఏ గుర్తుపై వేశామో, ఎక్కడ కనిపిస్తుందనే అంశాలపై వీర్వోలు రాజశేఖర్, వేణుగోపాల్ ప్రజలు అవగాహన కల్పించారు.

వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పులు

మిడుతూరు: వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పులు చేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ క్రాంతికుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ మార్చడంతో 15 రోజుల పాటు విద్యుత్ సరఫరాలో మార్పులు చేసినట్లు వెల్లడించారు. శనివారం నుంచి ఏ గ్రూపులోని రైతులకు రాత్రి 2 నుంచి 11 గంటల వరకు, బీ గ్రూపు పరిధిలోని రైతులను 11 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు, రాత్రి తొమ్మిది నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి



మహానందిలో విజయ చందర్

మహానంది: రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఏపీ మత్స్యకార వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ విజయ చందర్ తెలిపారు. మహానందీశ్వర స్వామి దర్శనార్థం శుక్రవారం మహానంది వచ్చారు. శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివారిని దర్శించుకుని పూజలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు వలలు, ఇంజిన్ బోట్లు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



తస్లీమ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం

కర్నూలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగిన అండర్-17 బాలబాలికల ఫుట్‌బాల్ పోటీల్లో బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని తస్లీమ్ బ్రాంజ్ మెడల్ సాధించిందని హెచ్‌ఎం మాధురి శుక్రవారం తెలిపారు. విద్యార్థిని, పీడీ చిత్తుల రవికుమార్‌ను అభినందించారు.

వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేకం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో వెలసిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వామి వారికి వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. ముందుగా చక్రాకారంలో 108 కలశాలకు కలశ స్థాపన గావించి ముఖ్య నదుల నుంచి తీసుకొచ్చిన జలాన్ని నింపి విశేష పూజలు చేపట్టారు.

ధర్మ సమ్మేళనానికి ఆహ్వానం

నంద్యాల(అర్బన్): సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న ఉయ్యాలవాడలో నిర్వహించనున్న హిందూ ధర్మ సమ్మేళనంలో పాల్గొనాలని ఫౌండేషన్ నంద్యాల నగర కన్వీనర్ చింతలపల్లె వాసు, ఆళ్లగడ్డ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ నరసింహులు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపీ కార్యాలయంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

సంప్రదాయ కళలను ప్రోత్సహించాలి

నంద్యాల(న్యూటౌన్): సంప్రదాయ కళలతో పాటు రాయలసీమ ప్రాంత కళలను ప్రోత్సహించాలని చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ రాకేష్‌రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక టౌన్‌హాల్‌లో బాలోత్సవం కార్యక్రమం జరిగింది. ఇందులో 39 రకాల వేషధారణ, మట్టిబొమ్మలు, క్విజ్, వ్యాసరచన పోటీలు, కోలాటం, శాస్త్రీయ నృత్యం తదితర కార్యక్రమాలు జరిగాయి. 3వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

12 వరకు కోర్టు విధుల బహిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు 2022 చట్టం ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోపై న్యాయవాదులు జనవరి 12వ తేదీ వరకు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రవీంద్రకుమార్, కార్యదర్శి ప్రతాపరెడ్డి శుక్రవారం తెలిపారు. కక్షిదారులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.



రుద్రవరంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు







నాగటూరులో కబడ్డీ పోటీల్లో తలబడుతున్న క్రీడాకారులు, వాలీబాల్ సర్వీస్‌చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి, వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

నందికొట్కూరు: ఆడుదాం..ఆంధ్రా పోటీలను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కిశోర్ కోరారు. శుక్రవారం పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న పోటీలను టౌన్ ప్లానింగ్ అధికారి బాలమద్దయ్య, సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, పీడీలు జెసింత, డోరతి, పద్మలత, విజయ కుమారి, లక్ష్మి సరస్వతి, పరిశీలించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడాకారులకు కోసం ప్రభుత్వం మెడికల్ క్యాంపులు నిర్వహించింది.

పాములపాడు: మండలంలోని మిట్టకందాల, రుద్రవరం గ్రామాల్లో శుక్రవారం క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. మిట్టకందాలలో నిర్వహించిన క్రికెట్‌లో 10 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 135 పరుగులు సాధించారు. కాగా అందులో ఓపెనర్లు నరేంద్ర 24 బంతుల్లో 56 పరుగులు నాటౌట్‌గా నిలిచాడు. మరో ఓపెనర్ చైతన్య 30 బంతుల్లో 48 పరుగులు సాధించి వికెట్ కోల్పోయాడు. ఇద్దరూ వంద పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. పాములపాడులో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సర్పంచులు రుద్రవరం రామస్వామి, మిట్టకందాల చింతల నారాయణ, ప్రత్యేకాధికారులు డాక్టర్ అనిల్, లలిత ప్రభావతి, పీడీలు రాజశేఖర్, నాగరాజు, సాయికృష్ణ, కళ్యాణి, పంచాయతీ కార్యదర్శులు కృష్ణప్రియ, ప్రభాకర్ పాల్గొన్నారు.



షటిల్ ఆడుతున్న మున్సిపల్ కమిషనర్ కిశోర్

నందికొట్కూరు రూరల్ : మండలంలోని నాగటూరు గ్రామంలో శుక్రవాం కబడ్డీ పోటీలను శాప్ జిల్లా కోఆర్డినేటర్ రవికుమార్ ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యమవుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శి రవీంద్ర పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: క్రీడల వల్ల మానసికోల్లాసంతో పాటు చదువుపై ఏకాగ్రత వస్తుందని ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి తెలిపారు. శుక్రవారం మండ్లెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. పీఈటీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఉస్మాన్‌బాషా పాల్గొన్నారు.

కర్నూలు: యువత తమ ప్రతిభను చాటుకునేందుకు క్రీడలు దోహద పడుతాయని సింగిల్ విండో డైరెక్టర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం బోయ రేవుల గ్రామంలో ఆడుదాం ఆంధ్రా పోటీలను వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

కర్నూలు: పగిడ్యాల, పాత ముచ్చుమర్రి, నెహ్రూ నగర్, పడమర ప్రాతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 25 మ్యాచ్‌లు నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ఉత్తమ ప్రదర్శన చూపిన వారిని మండల స్థాయికి ఎంపిక చేస్తామని ఎంపీడీఓ వెంకటరమణ పేర్కొన్నారు.



క్రికెట్‌లో వంద పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన మిట్టకందాల క్రీడాకారులు నరేంద్ర, చైతన్య



వాలీబాల్ ఆడుతున్న సింగిల్ విండో డైరెక్టర్ వెంకటరమణ



టచ్ కోసం ప్రయత్నిస్తున్న రైడర్



ముచ్చుమర్రిలో జరిగిన వాలీబాల్ పోటీలో బాల్‌ను కట్ కొడుతున్న క్రీడాకారుడు



నిరుపేదలకు భూ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

భూ పట్టాల పంపిణీ

నందికొట్కూరు: భూమిలేని నిరుపేద దళితులకు భూ పంపిణీ చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయించారని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అసైన్‌మెంట్ కమిటీ గుర్తించి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నిరుపేద దళితులకు భూ ట్టాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో పేదలకు ఒక సెంటు స్థలం ఇవ్వలేదని విమర్శించారు. కనీసం ఇంటి స్థలం కూడా ఇవ్వలేని వ్యక్తి ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ కన్నా మిన్నగా పాలన చేస్తాననడం హాస్యాస్పదమన్నారు. టీడీపీ పాలనలో దళితులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి, తహసీల్దార్ రాజశేఖర్ బాబు, డీటీ సత్యనారాయణ, వీఆర్వోలు రసీద్, శ్రీనివాసులు, నాయకులు చిట్టిరెడ్డి, డాక్టర్ రాజు పాల్గొన్నారు.

3న అధ్యాపక పోస్టుకు ఇంటర్వ్యూ

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకుల బాలికల సంక్షేమ పాఠశాలలో మహానంది (నెరవాడ)లో పోస్టుగాడ్యుయేషన్ ఫిజికల్‌సైన్స్ అధ్యాపక పోస్టుకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్. బి.రవీంద్రారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిషు మీడియంలో పీజీతో పాటు బీఈడీ, టెట్‌లో 50 శాతం మార్కులు కలిగిన ఉమ్మడి కర్నూలుకు జిల్లా చెందిన మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. అర్హత కలిగిన వారు జనవరి 3వ తేదీన సున్నిపెంటలోని గిరిజన గురుకుల కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు నేరుగా హాజరు కావాలని సూచించారు. ఉదయం 09:30 నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు జరిగే డెమో, ఇంటర్వ్యూలో పాల్గొని తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను సమర్పించాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ 9490957268 నంబర్లో సంప్రదించాలని కోరారు.

గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

నంద్యాల టౌన్: జిల్లా వ్యాప్తంగా గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి వెంకటరమణ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ట్రైబల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు సికెల్ సెల్, అనీమియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి నుంచి గిరిజన ప్రాంతాల్లోని వైద్యాధికారులు సచివాలయ ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు, రక్త హీనత పరీక్షల స్క్రీనింగ్ టెస్టులపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆర్‌బీఏకే జిల్లా కోఆర్డినటర్ డాక్టర్ కాంతారావు నాయక్, ఏఓ చంద్రశేఖర్, డెమో రవీంద్ర నాయక్, డాక్టర్ శ్రీజ పాల్గొన్నారు.

234 గ్రామాల్లో సమగ్ర రీ సర్వే

నంద్యాల: జిల్లాలో జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం కింద 234 గ్రామాల్లో సమగ్ర రీ సర్వే జరిపి భూ హక్కు పత్రాలను సంబంధిత రైతులకు అందజేశామని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో 11 గ్రామాల్లోని 15,670 ఎకరాల విస్తీర్ణంలో రీ సర్వే, గ్రౌండ్ ట్రూథింగ్ పనులు నిర్వహించి 19,155 సరిహద్దు రాళ్లు పాతామన్నారు. రెండవ విడతలో 73 గ్రామాల్లోని 1,53,998 ఎకరాల విస్తీర్ణంలో రీ సర్వే, గ్రౌండ్ ట్రూథింగ్ పనులు నిర్వహించి 87,855 సరిహద్దు రాళ్లు వేశామని, మూడవ విడతలో 150 గ్రామాల్లో 5,54,001 ఎకరాల విస్తీర్ణంలో రీ సర్వే, గ్రౌండ్ ట్రూథింగ్ పనులు నిర్వహించి ఇప్పటి వరకు 13,794 సరిహద్దు రాళ్లు పాతామని పేర్కొన్నారు.

రీసర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ శామూన్

నంద్యాల: జిల్లాలో మూడవ విడతలో చేపట్టిన భూ రీ సర్వే ప్రక్రియ పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రీ సర్వే, ఆర్‌ఓఆర్, మ్యుటేషన్ సేవలు, భూ సేకరణ - పరాయీకరణ, వ్యవసాయ భూముల కేటాయింపు తదితర నిర్దేశిత రెవెన్యూ లక్ష్యాల సాధనపై జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే మూడవ విడత కార్యక్రమాన్ని వేగవంతం చేసి ఈనెల 15వ తేదీలోగా ఫైనల్ ఆర్‌ఓఆర్ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తయి సర్వే నంబర్లలోని కొలతల్లో తేడాలొస్తే సంబంధిత భూ యజమానులు ఏడాదిలోపు దరఖాస్తులు సమర్పించుకునేలా రైతుల్లో భరోసా కల్పించాలన్నారు. భూ హద్దుల కొలతలపై చిన్నచిన్న అభ్యంతరాలు వ్యక్తం చేస్తే వాటిని కూడా పరిష్కరించేందుకు తహసీల్దార్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. రీ సర్వే ప్రక్రియకు సంబంధించి గ్రౌండ్ ట్రూథింగ్, ఫైనల్ ఆర్‌ఓఆర్, స్టోన్ ప్లాంటేషన్‌పై రోజు వారీ లక్ష్యాన్ని నిర్దేశించుకొని పూర్తి చేయాలని కోరారు. జేసీ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియపై సీసీఎల్ఏ నుంచి ప్రతిరోజు సమీక్షిస్తున్నారని ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు ఆర్‌డీఓలు, తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పందన తరహాలోనే రీ సర్వే పై వచ్చిన గ్రీవెన్సెస్‌ను కూడా రిజిస్టర్లో నమోదు చేసి 15 రోజుల్లోగా పరిష్కరించాలని తెలిపారు. డీఆర్‌ఓ పుల్లయ్య, ఏడి సర్వే లాండ్స్, సంబంధిత డివిజన్, మండలాల ఆర్డీఓలు, తహసీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

గిరిజనులు జీవనోపాధులను పెంచుకోవాలి



కుట్టు మిషన్లు అందజేస్తున్న డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్

ఆళ్లగడ్డ: గిరిజన మహిళలు జీవనోపాధులను పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా ఫారెస్ట్ అధికారి వినీత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అహోబిలంలో గిరిజన కుటుంబాలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందించిన కుట్టుమిషన్లతో జీవనోపాధిని పెంచుకొని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతినాయుడు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మూర్తుజావలి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ముక్తార్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

2న పొట్టేళ్ల పందేలు

పాములపాడు: నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని వాడాల గ్రామంలో జనవరి 2వ తేదీన పొట్టేళ్ల పందేలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఆర్‌సీఎం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోటీల్లో విజేతలకు వరుసగా.. రూ.15వేలు, రూ.10వేలు, రూ. 5వేలు, రూ.3వేల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు. వివరాలకు సెల్ 8978036038, 9515325161 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు ధర్మకర్తల మండలి సమావేశం

మహానంది: దేవస్థానంలోని కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో శనివారం ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఈఓ మాట్లాడుతూ దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా.మహేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో ఆలయంలో జరుగుతున్న అభివద్ధి పనులు, ఏపీ టూరిజం వద్ద ఉన్న షాపు తొలగింపు, మరోచోట కేటాయింపు, దాతలకు కల్పించాల్సిన సౌకర్యాలు తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. దేవస్థానం ఖాతాలో ఉన్న రూ. 10కోట్ల నుంచి రూ. 4 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం తదితర విషయాలపై సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

పనుల పరిశీలన

మహానంది: జేఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న టాయిలెట్స్ కాంప్లెక్స్ సముదాయాన్ని దేవస్థానం కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్ రెడ్డి, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున రావు శుక్రవారం పరిశీలించారు. ఈఓ మాట్లాడుతూ సుమారు రూ.40 లక్షలతో 27 టాయిలెట్లను నిర్మిస్తున్నారని, భక్తుల సౌకర్యార్థం మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏఈ శ్రీనివాసులు, హరినాథ్ పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

కర్నూలు: మహానంది మండలం గాజులపల్లె గ్రామానికి చెందిన బైరీ గోపిని అరెస్ట్ చేసి పది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు మహానంది ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గోపిని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపినట్లు చెప్పారు.

బీమా తక్షణ సాయం అందజేత

పగిడ్యాల: శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన గొల్ల లక్ష్మన్న (30) తల్లి లక్ష్మీదేవికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను జెడ్పీటీసీ పుల్యాల దివ్య శుక్రవారం అందజేశారు. మృతుడు బీమా పథకానికి అర్హుడు కావడంతో అంత్యక్రియల నిమిత్తం సొమ్ము అందజేశామని పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి తెలిపారు. సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, వెల్ఫేర్ అసిస్టెంట్ గణేష్ ఉన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్ల పల్లకీ సేవ శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, పండితులు ముందుగా ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ప్రత్యేకంగా ముస్తాబు చేసిన పల్లకీలో కొలువుంచి గణపతి పూజ, పుణ్యాహవాచనం, హారతి, అలంకార, ఉత్సవ పూజలు చేపట్టారు. బలిహరణ పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.

మేక్ ఇన్ ఇండియా ధ్యేయంగా ప్రభుత్వ చర్యలు

పగిడ్యాల: మేక్ ఇన్ ఇండియా ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసిందని బీజేపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సుంకన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు యాదవ్ పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం లక్ష్మాపురం, పడమర ప్రాతకోట సచివాలయం వద్ద సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేశారు. అధికారులు, బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రతి ఇంటికి కేంద్రప్రభుత్వ పథకాలు అందించాలనే ఆశయంతో ప్రధానమంత్రి సుమారు 50కి పైగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్ సుజాత చేతుల మీదుగా 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఏఓ విజయ్‌జ్యోతుకుమార్, వైద్యాధికారి కృష్ణమూర్తి, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్, ఏపీఓ మద్దిలేటి, ఏపీఎం శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ శ్రీనాథ్, పంచాయతీ కార్యదర్శి సమతయశోధర, సర్పంచ్ సుజాత పాల్గొన్నారు.

పోస్టులు భర్తీ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి నాగరాముడు కోరారు. శుక్రవారం ఈ మేరకు ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రూప్-1, 2 అభ్యర్థులకు వయో పరిమితి పెంచాలని, నిరుద్యోగులకు రూ.3వేలు భృతి ఇవ్వాలని, వైద్య ఆరోగ్య శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.అంజి, రవి, విష్ణు, స్వామి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘం నాయకులు భాస్కర్ కోరారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మెడకు ఉరి తాళ్లు వేసుకుని కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన కోరికలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మిక సంఘం నాయకులు పరమేష్, నాగేశ్వరరావు, చాంద్‌బాషా, నాగరాజు, శ్రీను, హరికృష్ణ పాల్గొన్నారు.

ఆకతాయిలకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆకతాయిలకు సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను ఖరారు చేశారని పోలీసు సిబ్బంది శుక్రవారం తెలిపారు. వివరాలు.. పట్టణానికి చెందిన తలారి ధనుష్, షేక్ రియాజ్ సాయిబాబానగర్ వద్ద రోడ్డుపై వెళ్తున్న మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా ధనుష్‌కు ఐదు రోజులు, షేక్ ఫయాజ్‌కు రెండు రోజులు శిక్షను ఖరారు చేశారని వివరించారు.

ఎక్స్‌గ్రేషియా అందజేత

కర్నూలు: నంద్యాల పట్టణంలోని రైతునగరం ప్రాంతానికి చెందిన పబ్లిక్ హెల్త్ వర్కర్ కాశమ్మ ఇటీవల మృతి చెందడంతో ప్రభుత్వం ఆమె కుటుంబానికి రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఇందుకు సంబంధించిన చెక్కును మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, కమిషనర్ రవిచంద్రారెడ్డి శుక్రవారం అందజేశారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, ఎంహెచ్‌ఓ అంకిరెడ్డి పాల్గొన్నారు.

సంగమేశ్వరుడి సన్నిధి చేరిన అక్షితలు

కొత్తపల్లి: అయోధ్య శ్రీరాముడి అక్షితలు మండలంలోని సప్తనది తీరంలో వెలసిన సంగమేశ్వరుడి సన్నిధికి చేరాయి. నంద్యాల రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, కొత్తపల్లి పోలీసులతో కలిసి శుక్రవారం అక్షితలను ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మకు అందజేశారు. అనంతరం సంగమేశ్వరుడి సన్నిధిలో అక్షితలకు విశేష పూజలు జరిపించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు సుదర్శన్,హరినాథ్, గోకవరం పుల్లారెడ్డి, ఆశ్రమ ప్రముఖ్ రామకృష్ణ, సమరసత సేవా ఫౌండేషన్ హనుమంత రెడ్డి పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

పగిడ్యాల: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధమైన ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సుధాకర్‌గౌడ్ పశువుల కోసం కొనుగోలు చేసిన వరిగడ్డిని కళ్లంలో ట్రాక్టర్ అన్‌లోడ్ చేస్తుండగా పక్కనున్న విద్యుత్ తీగలకు తగిలి నిప్పురవ్వలు పడ్డాయి. ఈ ప్రమాదంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి పశుగ్రాసం దగ్ధమైంది. సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న స్థానికులను పోగు చేసి మంటలను ఆర్పేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించారు. కర్నూలు నుంచి అగ్నిమాపక యంత్రం వచ్చేలోగా మంటలను ఆర్పివేశారు.